క్లుప్తంగా

రైతుబజార్లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా 63, వంకాయ 40, బెండ 40, పచ్చిమిర్చి 50, కాకర 48, బీర 45, కాలిఫ్లవర్ 23, క్యాబేజీ 26, కారెట్ 45. దొండ 35, ఆలు 22, ఉల్లి 22, గోకర 37, దోస 25, సొర 13, పొట్ల 23, అరటి 11, చిక్కుడు 65, అర్వి 40, మునగ 28, చిలగడదుంప 35, బీట్‌రూట్ 26, కీర 18, ఫ్రెంచ్ బీన్స్ 65, కాప్సికమ్ 60. ఈ ధరలు గురువారం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్ల కొమ్మల తొలగింపు, పలు మరమ్మతు పనుల కారణంగా గురువారం ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలోని ఈ కింది ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని డీఈ హన్మంత్‌రావు తెలిపారు.

◆ ఉ.9 నుంచి మ. 11 గంటల వరకు... గురుదాస్, సలీంనగర్, రామారావు కంపెనీ, సలీంనగర్ మిల్క్‌బూత్ డౌన్, పద్మావతీ అపార్ట్‌మెంట్స్, సలీంనగర్ గణేష్ టెంపుల్ పరిసర ప్రాంతాలు

◆ మ.11 నుంచి 12 గంటల వరకు... గణేష్ టెంపుల్, సలీంనగర్, హీరో హోండా షోరూం వెనుక వైపు, రామాలయం స్ట్రీట్, రామచంద్రా ఐటీఐ, ఇంద్రసేనారెడ్డి పీటీ, శ్రీపురం కాలనీ రోడ్ పరిసర ప్రాంతాలు

◆ మ. 12 నుంచి ఒంటి గంట వరకు... రేస్‌కోర్స్, మసీద్, శ్రీపురం కాలనీ, డక్కన్ టవర్స్ పరిసర ప్రాంతాలు

◆ మ. 3 నుంచి సా. 5 గంటల వరకు... ఏబీ కాలనీ, వాటర్‌పంప్, మిడాస్ హాస్పిటల్, బవార్చీ హోటల్, వాటర్‌ట్యాంక్, గంగా టవర్, సాయిబాబా టెంపుల్, రైల్వే రిజర్వేషన్ కౌంటర్, పుల్లారెడ్డి స్వీట్స్ పరిసర ప్రాంతాలు.

ప్రతి ఒక్కరూ సేవా భావం కలిగి ఉండాలి

హస్తినాపురం: ప్రతిఒక్కరూ సేవా భావం కలిగి ఉండాలని నాగార్జున విద్యాసంస్థల చైర్మన్ గుమ్మకొండ విఠల్‌రెడ్డి అన్నారు. విఠల్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఇటీవల హస్తినాపురం సెంట్రల్ కాలనీలోని నాగార్జున మాంటిస్సోరీ, మోడల్‌స్కూల్‌లో చారిటీ డే నిర్వహించారు. విద్యార్థుల నుంచి సేకరించిన సరుకులకు తోడు యాజమాన్యం మరికొంత కలిపి కీర్తన అనాథాశ్రమానికి ఐదు క్వింటాళ్ల బియ్యం, 50 కేజీల కందిపప్పు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ కె.విజయ్‌కుమార్ రావు, ఇన్‌చార్జి పుష్పలత, అరుణ, దివ్య, ప్రియాంక, ఉషశ్రీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మలక్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా చంద్రశేఖర్



మలక్‌పేట: మలక్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా నాగం చంద్రశేఖర్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. వారం రోజుల క్రితం ఇక్కడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన పి.రవీంద్రప్రసాద్ జూబ్లీహిల్స్ లా అండ్ ఆర్డర్ పీఎస్‌కు ఎస్‌హెచ్‌ఓగా బదిలీ అయ్యారు. వెయింటింగ్‌లో ఉన్న నాగం చంద్రశేఖర్ మలక్‌పేటకు వచ్చారు.

వృద్ధురాలి అదృశ్యం



మహాలక్ష్మి

హస్తినాపురం: ఇంటి నుంచి బయటికి వెళ్లిన వృద్ధురాలు అదృశ్యమైన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పోలీస్‌స్టేషన్ పరిధిలోని బీఎన్‌రెడ్డినగర్ కాలనీ, చైతన్యనగర్‌లోని తన ఇంటి నుంచి మంగళవారం బయటికి వెళ్లిన జవ్వాని మహాలక్ష్మి (87) అనే వృద్ధురాలు తిరిగి ఇంటికి రాకపోవడంతో కంగారు చెందిన కుటుంబ సభ్యులు తమ బంధువులు, స్నేహితులను వాకబు చేసినా ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబ సభ్యులు వనస్థలిపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'ఆమ్ ఆద్మీ' ఎల్‌బీనగర్ కో కన్వీనర్‌గా రాకేష్‌రెడ్డి



మన్సూరాబాద్: ఆమ్ ఆద్మీ పార్టీ ఎల్‌బీనగర్ నియోజకవర్గం కో–కన్వీనర్‌గా ఎల్‌బీనగర్‌కు చెందిన ఎడ్ల రాకేష్‌రెడ్డిని నియమించారు. ఈ మేరకు ఆ పార్టీ మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి బుర్ర రాములుగౌడ్ నియామకపత్రాన్ని జారీ చేసి బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ, ఎల్‌బీనగర్‌లో పార్టీ పటిష్టతకు కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్, రాములుగౌడ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

ఫిర్యాదు చేసినా పట్టించుకోరు!



ఆనంద్‌నగర్‌లో పారుతున్న మురుగు

● నాగోలు డివిజన్‌లోని రోడ్లపై మురుగు పరుగు
● దుర్వాసనతో ప్రజలకు ఇక్కట్లు

నాగోలు: ప్రధాన రహదారులపై ఎక్కడ చూసినా మురుగు ఏరులైపారుతోంది... డ్రైనేజీ నీటితో చిత్తడిగా మారిన రోడ్లు, ఎగసి వస్తున్న దుర్వాసనతో స్థానికులు, వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. హయత్‌నగర్ సర్కిల్ పరిధిలోని నాగోలు డివిజన్‌లోని పలు కాలనీల్లోని పరిస్థితే ఇందుకు నిదర్శనం. సమస్యను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదని ఆయా కాలనీలవారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

◆ డివిజన్‌లోని సాయినగర్ కాలనీ రోడ్డు నం.3లో రెండు నెలలుగా డ్రైనేజీ పొంగి పొర్లుతున్నా అధికారులు పట్టించకోవడం లేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

◆ జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం ఉండటం లేదని ఆరోపిస్తున్నారు.

◆ సాయినగర్‌కాలనీ, బండ్లగూడ చౌరస్తా, ఆనంద్‌నగర్ నుంచి జీఎస్‌ఐ వెళ్లే మార్గం, గోపాలకృష్ణాపురం, మధురనగర్, జైపురికాలనీ, మల్లికార్జుననగర్ రహదారిపై నిత్యం డ్రైనేజీ నీరు పారుతోంది.

◆ ఆనంద్‌నగర్ చౌరస్తా వద్ద ప్రధాన రహదారిపై 20 రోజులుగా డ్రైనేజీ పొంగి రోడ్డు పై పారుతున్నా జలమండలి అధికారులు పట్టించుకోవడం లేదని చెప్తున్నారు.

◆ మురుగు నుంచి వస్తున్న దుర్వాసనను భరించలేకపోతున్నామని, వ్యాధుల బారినపడుతున్నామని స్థానిక కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చెప్తున్నారు.

◆ మల్లికార్జుననగర్‌లోని బస్తీల్లో నిరంతరం డ్రైనేజీ పొంగి పొర్లుతోంది. బస్తీ వాసులు అనేక సార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పెద్దగా స్పందించడం లేదని బస్తీవాసులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా జలమండలి అధికారులు స్పందించి నాగోలు డివిజన్ పరిధిలోని రహదారులపై మురుగు పారకుండా చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు.



గోపాలకృష్ణాపురంలో పారుతున్న డ్రైనేజీ నీరు



సాయినగర్ కాలనీలో ఇదీ పరిస్థితి

ప్రణాళికాబద్ధంగా ప్రతి కాలనీ అభివృద్ధి: ఎమ్మెల్యే



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్ లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: ప్రణాళికాబద్ధంగా ప్రతి కాలనీని అభివృద్ధి చేస్తానని, శివారు కాలనీల్లో ప్రతి ఇంటికీ మంచి నీటి సౌకర్యం కలిపిస్తానని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో బుధవారం రూ.3 కోట్ల 96 లక్షలతో తాగునీటి, కమ్యూనిటీహాల్, పార్క్, సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నియోజకవర్గంలో ప్రధాన సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కారమవుతున్నాయన్నారు. కాలనీల్లో తాగునీటి, డ్రైనేజీ, రోడ్ల సౌకర్యం కలిపించిన తర్వాత మిగతా సదుపాయాలు ఏర్పాటు చేస్తామన్నారు. 118 జీఓ ద్వారా ఎంతో మందికి మేలు జరిగిందన్నారు. కార్యక్రమంలో డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్ రెడ్డి, నాయకులు కుంట్లూర్ వెంకటేశ్‌గౌడ్, నర్సింగ్ రావు, అనిల్ చౌదరి, బుచ్చిరెడ్డి, మహేష్, సుమన్‌గౌడ్, రమేష్‌నాయుడు పాల్గొన్నారు.

వరదకు ధ్వంసమైన రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి

హస్తినాపురం: ఇటీవల కురిసిన భారీవర్షాలకు డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో వరద ముంపునకు చెడిపోయిన రోడ్లు, డ్రైనేజీలకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని అధికారులను హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ కోరారు. హస్తినాపురం డివిజన్ పరిధిలోని ధాతునగర్, సాయిగణేశ్‌నగర్ మీదుగా నిర్మించిన వర్షపు నీటి కాలువ వల్ల ముంపునకు గురై అక్కడ కొన్ని రోడ్లు దెబ్బతిన్నాయి. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వాణితో కలిసి కార్పొరేటర్ సుజాతానాయక్ ఆ కాలనీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, పనులన్నింటినీ అధికారులు త్వరితగతిన పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మీర్‌పేట డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్‌రెడ్డి, మీర్‌పేట కార్పొరేటర్ ఎనుగుల అనిల్‌కుమార్ యాదవ్, ఇంజినీర్లు శ్రీనివాస్, హేమూ నాయక్, నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, విద్యాధర బట్టు, శివకుమార్, మేకల యాదగిరి పాల్గొన్నారు.



సాయిగణేశ్‌నగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ సుజాతానాయక్

దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి కృషి

మలక్‌పేట: డివిజన్‌లోని దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించడానికి శాయశక్తులా కృషి చేస్తానని మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీ మధుసూదన్ రెడ్డి అన్నారు. శాలివాహననగర్‌లో నాలా నిర్మాణ పనులను బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. నాలా ఏర్పాటుతో కాలనీవాసులకు వరదనీటి సమస్య దూరం అవుతుందన్నారు. కాలనీవాసులు సమస్యను తన దృష్టికి తెచ్చిన వెంటనే అధికారులతో మాట్లాడి పనులు వేగవంతం చేశామన్నారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా సకాలంలో పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ సత్తిరెడ్డి, ఎస్‌ఎఫ్‌ఏ ముజీబ్ నాయకులు దినేష్, మల్లేష్ పాల్గొన్నారు.



నాలా పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

కేటీఆర్‌ను కలిసిన మాజీ కార్పొరేటర్

సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్ కార్పొరేటర్ సామ స్వప్నాసుందర్‌రెడ్డి తన పుట్టిన రోజు సందర్భంగా బుధవారం మంత్రి కేటీఆర్‌ను క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కేటీఆర్.. నిత్యం ప్రజలతో మమేకమై ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారని స్వప్నాసుందర్‌రెడ్డి అన్నారు. మంత్రిని కలిసిన వారిలో యాకత్‌పురా నియోజకవర్గ టీఆర్‌ఎస్ ఇన్‌చార్జ్ సామ సుందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకుడు కార్తీక్ ఉన్నారు.



సామ స్వప్నాసుందర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి కేటీఆర్

అధికారులు ప్రొటోకాల్ పాటించడంలేదు: లచ్చిరెడ్డి



వాటర్ వర్క్స్ జీఎం ఆఫీసులో ఖాళీ కుర్చీకి వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్లు

ఎల్‌బీనగర్: వాటర్ వర్క్స్ అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదని, శంకుస్థాపనలపై కనీసం సమాచారం ఇవ్వలేదని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి ఆరోపించారు. బుధవారం బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో జరిగిన అభివృద్ధి పనుల్లో అధికారులు ప్రొటోకాల్ పాటించలేదన్నారు. శ్రీనివాస కాలనీలో కాలనీవాసులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో ఎమ్మెల్యే తన అనుచరుల ఫొటోలు లేవని శంకుస్థాన చేయకుండా వెళ్లిపోయారని, ఇది ఎంత వరకు సమంజసమని కార్పొరేటర్ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం బీజేపీ కార్పొరేటర్లు వంగ మధుసూదన్‌రెడ్డి, కళ్లెం నవజీవన్‌రెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డి, వెంకటేశ్వర రెడ్డిలతో కలిసి వాటర్ వర్క్స్ జీఎంకు ఫిర్యాదు చేసేందుకు వెళ్లారు. జీఎం అందుబాటులో లేకపోవడంతో కార్పొరేటర్లు జీఎం కుర్చీకి వినతిపత్రం అందజేశారు.అనంతరం కార్పొరేటర్లు మాట్లాడుతూ, జీఎం ఆఫీసుకొస్తున్నానని చెప్పడంతో మేము మూడు గంటలు వేచి ఉన్నా.. రాలేదని ఆరోపించారు. కనీసం ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి పేరు కూడా ప్రారంభోత్సవ శిలాఫలకాలపై వేయించలేదని, అధికారులు తమ తీరు మార్చుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, చిత్రాంజన్, సరస్వతి, నందకిషోర్, పాండురంగా రెడ్డి, రవికుమార్, సంజీవరెడ్డి, యాదయ్య, అజాద్, అశోక్, సైదులు పాల్గొన్నారు.

పేదింటి యువతి పెళ్లికి 'ఉప్పల' ఫౌండేషన్ చేయూత



యువతికి పుస్తె, మెట్టెలు అందజేస్తున్న శ్రీనివాస్‌గుప్తా

నాగోలు: పేదలకు చేయూత అందించడంలో ఉప్పల ఫౌండేషన్ ఎల్లప్పుడూ ముందు ఉంటుందని ఉప్పల ఫౌండేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. జనగాం జిల్లా, వనపర్తి గ్రామానికి చెందిన పేద దంపతులు ఉపేందర్, సత్తమ్మ తమ కూతురు మౌనిక వివాహం సందర్భంగా శ్రీనివాస్ గుప్తాను బుధవారం నాగోల్‌లోని క్యాంప్ కార్యాలయంలో కలిశారు. పెళ్లికూతురికి పుస్తె, మెట్టెలు, చీర, గాజులను శ్రీనివాస్ గుప్తా విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో శ్యామ్, సల్వాచారి, శశికాంత్, పద్మాకర్ పాల్గొన్నారు.

గందరగోళంగా 'గృహలక్ష్మి': ప్రజా పార్టీ

వనస్థలిపురం: గృహలక్ష్మి పథకం గందరగోళంగా మారిందని, రాష్ట్రవ్యాప్తంగా దరఖాస్తుల స్వీకరణ ఒకే రకంగా లేక ప్రజలు మీ సేవ, తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ప్రజా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ దాసరి అజయ్‌కుమార్ యాదవ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి వైన్స్ షాపుల టెండర్ల దరఖాస్తులపై ఉన్న శ్రద్ధ ప్రజలకు ఉపయోగపడే సంక్షేమ పథకాలపై లేదన్నారు. వైన్స్ షాపు దరఖాస్తు కోసం 20 రోజుల గడువు పెట్టి, గృహలక్ష్మి పథకం దరఖాస్తుల స్వీకరణకు మూడు రోజుల గడువు పెట్టడం దురదృష్టకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి పేదలపై చిత్తశుద్ధి ఉంటే గృహలక్ష్మి పథకాన్ని నిరంతరంగా కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో సాధ్యం కాని పథకాలు పెట్టి సామాన్యులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, బీసీ బంధు, దళిత బంధు పథకాల ద్వారా ఎంత మందికి లబ్ధి చేకూరిందో శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

రాజస్థాన్‌లో సాగు.. హైదరాబాద్‌లో విక్రయం

గంజాయి అమ్ముతున్న వ్యక్తి అరెస్ట్

ఇబ్రహీంపట్నం రూరల్: రాజస్థాన్‌లో తన ఇంటి వద్ద సాగు చేసిన గంజాయిని కారంపొడి డబ్బాల్లో తరలించి హైదరాబాద్‌లో విక్రయిస్తున్న వ్యక్తిని మహేశ్వరం జోన్ ఎస్‌ఓటీ, ఆదిబట్ల పోలీసులు అరెస్టు చేసి బుధవారం రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఓటీ సీఐ రవికుమార్, ఆదిబట్ల సీఐ రఘువీర్‌రెడ్డి కథనం ప్రకారం.. రాజస్థాన్ రాష్ట్రం, బిల్వాడ జిల్లా, బాక్లి గ్రామానికి చెందిన మహేందర్ సింగ్ పది సంవత్సరాల క్రితం హైదరాబాద్‌కు వలస వచ్చాడు. ప్రస్తుతం తుర్కయంజాల్ రాంనగర్ కాలనీలో కిరాణా దుకాణం నిర్వహిస్తున్నాడు. కరోనా సమయంలో వ్యాపారంలో నష్టాలు రావడంతో మాదకద్రవ్యాల విక్రయం మొదలు పెట్టాడు. రాజస్థాన్‌లోని తన ఇంటి ఎదుట గంజాయి సాగు చేశాడు. అక్కడి నుంచి ప్రైవేటు ట్రావెల్స్‌లో కారం పొడి, మినుముల డబ్బాల్లో నింపి హైదరాబాద్‌కు తరలించేవాడు. నగరంలో 10 గ్రాముల గంజాయిని రూ.5 వేల నుంచి రూ. 6వేల వరకు విక్రయించేవాడు. ఈ విషయం తెలియడంతో మహేశ్వరం జోన్ ఎస్‌ఓటీ సీఐ రవికుమార్ నేతృత్వంలో దాడులు నిర్వహించారు. రూ.10 లక్షల విలువ చేసే 2.25 గ్రాముల గంజాయి, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

తపాలా కార్యాలయాల్లో జాతీయ జెండాల విక్రయం



జాతీయ జెండాలపై అవగాహన కల్పిస్తున్న పోస్టల్ సిబ్బంది

దిల్‌సుఖ్‌నగర్: హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా అన్ని తపాలా కార్యాలయాల్లో జాతీయ జెండాలను విక్రయిస్తున్నట్లు పోస్టల్ అధికారి రవి కిషోర్ తెలిపారు. బుధవారం రామకృష్ణాపురం సౌత్ సబ్ డివిజన్ పోస్ట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 20 నుంచి 30 అంగుళాల నిడివి గల జాతీయ జెండాను రూ. 25కు విక్రయిస్తున్నామన్నారు. ఆన్‌లైన్‌లో కూడా అమ్మకాలు చేస్తున్నామని, ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసిన వారి అడ్రస్‌లో తపాలా సిబ్బంది జెండాను అందజేస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ వినియోగించుకోవాలని కోరారు.

వేర్వేరు కారణాలతో ఇద్దరి ఆత్మహత్య

ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో నాగోలులో ఒకరు, తల్లిదండ్రులతో గొడవపడి మలక్‌పేట పరిధిలో మరొకరు బలవన్మరణానికి పాల్పడ్డారు.

ఆర్థిక ఇబ్బందులతో....

నాగోలు: ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, ప్రకాశం జిల్లాకు చెందిన పోకూరు మనోజ్(24) నాగోలు కో–ఆపరేటివ్ బ్యాంక్ కాలనీలో భార్య శ్రావణితో కలసి ఉంటున్నాడు. స్థానికంగా మేస్త్రీ కింద పని చేస్తున్నాడు. మనోజ్ మద్యానికి బానిసయ్యాడు. ఈ నేపథ్యంలో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. భార్య శ్రావణి గర్భవతి కావడంతో వైద్య పరీక్షల నిమిత్తం గ్రీన్ పార్క్ కాలనీలో ఉండే తల్లిగారి ఇంటికి వెళ్లి.. అక్కడి నుంచి హాస్పిటల్‌కు వెళ్లారు. ఈ నెల 8న ఇంట్లోకి వెళ్లిన మనోజ్ బయటకు రాలేదు. దీంతో ఇంటి యజమని వెంటిలేటర్ గ్రిల్స్ నుంచి చూడగా చీరతో ఉరేసుకొని చనిపోయి ఉన్నాడు. ఈ మేరకు కుటుంబసభ్యులు బుధవారం నాగోలు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

తల్లిదండ్రులతో గొడవపడి...

మలక్‌పేట: తల్లిదండ్రులతో గొడవపడ్డ ఓ యువకుడు మనస్తాపంతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మలక్‌పేట పోలీస్‌స్టేషన పరిధిలో ఈ ఘటన జరిగింది. అడ్మిన్ ఎస్‌ఐ కిరణ్‌లాల్ తెలిపిన వివరాల ప్రకారం... హనుమంతు అనే వ్యక్తి భార్య, ఇద్దరు కొడుకులతో కలిసి గడ్డిఅన్నారంలో నివాసం ఉంటున్నాడు. చిన్న కొడుకు డేవిడ్ లివింగ్‌సన్ (21) బ్యానర్లు, ఫెక్సీలు కట్టే పని చేస్తున్నాడు. ఇతను మంగళవారం రాత్రి మద్యం మత్తులో ఇంటికి వచ్చి తల్లిదండ్రులతో గొడవ పడ్డాడు. పని మీద బయటకు వెళ్లిన తల్లిదండ్రులు బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు ఇంటికి తిరిగి వచ్చేసరికి లివింగ్‌సన్ సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకొని కన్పించాడు. వెంటనే వారు ఇరుగు పొరుగు సహాయంతోఅతడిని కిందికి దింపి సమీపంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే లివింగ్‌సన్ మృతి చెందాడని నిర్ధారించారు. మృతుడి తండ్రి హనుమంతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం

మన్సూరాబాద్: యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఎల్‌బీనగర్ రింగ్‌రోడ్డులో బుధవారం ఘనంగా నిర్వహించారు. రింగ్‌రోడ్డులోని రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి యువజన కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు శివకుమార్, రాజశేఖర్, కిషోర్, భార్గవ్, కరీమ్, రాముయాదవ్, చరణ్‌నాయక్, వెంకటేష్, గోపి, రవి, సంతోష్, రాకేష్, సాయికృష్ణ పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న యూత్ కాంగ్రెస్ నేతలు

భార్య మృతికి కారణమైన భర్తకు జీవిత ఖైదు



నిందితుడు గాలయ్య

రంగారెడ్డి కోర్టులు: భార్య మృతికి కారణమైన భర్తకు జీవిత ఖైదుతో పాటు రూ.400ల జరిమానా విధిస్తూ శుక్రవారం ఎల్బీనగర్‌లోని 2వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి భవాని చంద్ర తీర్పు వెలువరించారు. 2016 లో మీర్‌పేట పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఈ కేసు వివరాలు ఏపీపీ కస్తూరి తెలిపిన ప్రకారం... నిందితుడు నర్ల గాలయ్య కూలీ పనులు చేసేవాడు. ఒక రోజు సెంట్రింగ్ పనులకు వెళ్లిన అతను భవనం పైనుంచి పడటంతో కాళ్లు విరిగాయి. కుటుంబ పోషణ భారంగా కావడంతో భార్య అలివేలు కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించింది.

కొన్ని రోజులకు కోలుకున్న నిందితుడు రియల్ ఎస్టేట్ వ్యాపారం ప్రారంభించాడు. తాగుడుకి బానిసై భార్య, పిల్లలను వేధించడం మొదలు పెట్టాడు. ఇదే క్రమంలో ఒక రోజు మద్యం తాగి ఇంటికి వచ్చిన గాలయ్యను తినడానికి ఇంట్లో బియ్యం లేవు, తీసుకురా అని భార్య కోరింది. బియ్యం తీసుకొని రాకపోగా భార్యాపిల్లలను కొట్టి, భార్యపై కిరోసిన్ పోసి చావమని తిట్టాడు. భర్త ప్రవర్తనకు విసుగుచెందిన అలివేలు అతడి కళ్ల ముందే ఒంటికి నిప్పంటించుకుంది. తీవ్ర కాలిన గాయాలకు గురైన ఆమెను ఉస్మానియా ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. కాగా, చికిత్స పొందుతున్న సమయంలో అలివేలు ఇచ్చిన మరణ వాగ్మూలం మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని, రిమాండ్‌కు తరలించారు. అనంతరం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసును విచారించిన న్యాయమూర్తి అలివేలు ఇచ్చిన మరణ వాంగ్మూలాన్ని కూడా పరిగణలోకి తీసుకుని నిందితుడికి జీవిత ఖైదుతో పాటు జరిమానా విధించింది.